క్లుప్తంగా

మున్సిపల్ డీఈ సరెండర్

బోధన్‌టౌన్(బోధన్): బోధన్ మున్సిపల్ డీఈ లింగంపల్లి శివానందంను మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయంలో సరెండర్ చేస్తూ కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు ఉత్తర్వులు జారీ చేశారు. రెండు రోజుల క్రితం కలెక్టరేట్‌లో తాగునీటిపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో డీఈపై ఫిర్యాదులు అందడంతో సరెండర్ చేసినట్లు తెలిసింది.

మందుబాబులపై ఆరా

సాక్షి ఎఫెక్ట్..

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ ఆనకట్టపై మద్యం సేవించి బాటిళ్లను పగలగొట్టిన ఘటనపై ఆర్మూర్ ఏసీపీ బస్వారెడ్డి ఆరా తీశారు. ఈ ఘటనకు సంబంధించి సోమవారం సాక్షి దినపత్రికలో 'మందుబాబులకు అడ్డాగా ఎస్సారెస్పీ' అనే శీర్షికతో వార్తా కథనం ప్రచురించింది. దీంతో స్పందించి ఆర్మూర్ ఏసీపీ బస్వారెడ్డి మందుబాబులపై ఆరాతీశారు. ఆనకట్టపై మద్యం సేవించినా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రూరల్ సీఐ శ్రీధర్‌రెడ్డి, మెండోరా ఎస్సై శ్రీనివాస్‌లను మందుబాబులపై నిఘా పెట్టాలని సూచించారు.

విత్తన పసుపు పంపిణీ



కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని పసుపు పరిశోధన స్థానంలో పండించిన అధిక కుర్కుమిన్ కలిగిన పసుపు విత్తనాలను సోమవారం రైతులకు పంపిణీ చేశారు. పరిశోధన స్థానంలో అధిక కుర్కుమిన్ కలిగిన ఏసీసీ 48, రాజేంద్ర సోనియా, బీఎస్ఆర్ 2, సేలం, దుగ్గిరాల ఎరుపు, పీతాంబర్ రకాలకు చెందిన విత్తనాలపై శాస్త్రవేత్తలు తమ పరిశోధనలు చేశారు. కమ్మర్‌పల్లి, చౌట్‌పల్లి, రెంజెర్ల, హాసకొత్తూర్, దోమకొండలకు చెందిన పలువురు రైతులు క్వింటాలుకు రూ.2 వేలు చెల్లించి విత్తనాలను తీసుకెళ్లారు. పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మహేందర్, టీఏ శ్రీనివాస్ పాల్గొన్నారు.

నామినేషన్ల స్వీకరణ



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ బార్ అసోసియేషన్(న్యాయవాదుల)ఎన్నికల నామినేషన్ ప్రక్రియలో భాగంగా సోమవారం నాలుగు నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల అధికారులు గటడి ఆనంద్, శ్రీనివాస్ తెలిపారు. అధ్యక్ష పదవికి తెడ్డు నర్సయ్య, ఉపాధ్యక్ష పదవికి శంకర్, ప్రధాన కార్యదర్శికి బొల్లారం రాజ్‌కుమార్, కోశాధికారి పదవులకు సుఖేష్ నామినేషన్లు దాఖలు చేసినట్లు వారు పేర్కొన్నారు. సీనియర్ న్యాయవాది కష్ణంరాజు, చిలుక సుభాష్, కీర్తి సాగర్, చైతన్య, శ్రీనివాస్, చరణ్, మధు తదితరులు పాల్గొన్నారు

చిన్నారులకు అక్షరాభ్యాసం



పెర్కిట్: మామిడిపల్లిలోని అంగన్‌వాడి కేంద్రంలో సోమవారం పోషణ పక్షోత్సవాలు నిర్వహించారు. గర్భిణులకు సీమంతం, 6 నెలలు నిండిన చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాస కార్యక్రమం చేపట్టారు. అలాగే బాలింతలకు తల్లిపాలపై అవగాహన, చిరుధాన్యాలు గురించి, పోషకాలతో కూడిన వంటల గురించి వివరించారు. తల్లిదండ్రులు 3 నుంచి 6 సంవత్సరాల గల చిన్నారులను అంగన్‌వాడి కేంద్రాలకు పంపించాలని కోరారు. చిన్నారులకు పోషకాహారంతో పాటు ఉచిత విద్యాబోధన అందిస్తామన్నారు. విద్యార్థుల అభివృద్ధి కార్డును అందజేశారు. కార్యక్రమంలో ఏసీడీపీవో ఆర్ జ్యోతి, సూపర్‌వైజర్ శ్రీదేవి, అంగన్‌వాడి టీచర్లు జగదాంబ, గోదావరి, సంగీత, శైలజ తదితరులు పాల్గొన్నారు.

సన్‌ఫ్లవర్ కొనుగోలు కేంద్రం ప్రారంభం




బోధన్: సాలూర మండలంలోని హున్స సొసైటీలో సోమవారం సన్‌ఫ్లవర్(పొద్దు తిరుగుడు) పంట కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ సీఈవో హన్మంత్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు పండించిన సన్‌ఫ్లవర్ పంటను ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటాలుకు రూ.6,760 కి కొనుగోలు చేస్తామన్నారు. మద్దతు ధర కంటే తక్కువకు పంటను అమ్ముకుని రైతులు ఆర్థికంగా నష్టపోకూడదనే లక్ష్యంతో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిందని పేర్కొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదాలు

- రోడ్ల పక్కనే వ్యవసాయబావులు
- కనీసం సూచిక బోర్డులు ఏర్పాటు చేయని వైనం
- పట్టించుకోని అధికార యంత్రాంగం



ఇస్సాపల్లికి వెళ్లే మార్గంలో ..



ఇస్సాపల్లి వద్ద రోడ్డు పక్కన ప్రమాదకరంగా ఉన్న వ్యవసాయ బావి

పెర్కిట్(ఆర్మూర్): రహదారులను ఆనుకుని ఉన్న వ్యవసాయ బావులతో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. ఆర్మూర్ మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే మార్గంలో రోడ్ల పక్కన గల వ్యవసాయ బావులు ప్రమాదకరంగా మారాయి. బావులకు ఎలాంటి రక్షణ కాని కనీసం సూచిక బోర్డులు గానీ లేకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం మెండుగా ఉంది. తెలంగాణ ప్రభుత్వం రవాణాను సౌకర్యవంతం చేయడానికి రోడ్ల విస్తరణ చేపట్టినప్పటికి ప్రమాదకర వ్యవసాయ బావుల పట్ల ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టలేదు. విస్తరణతో వ్యవసాయ బావులు రోడ్లకు అతి సమీపంలోకి రావడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువయ్యాయి. ఆర్మూర్ నుంచి ఆలూర్ మీదుగా నందిపేట్ మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే మార్గంలో రోడ్డు ప్రక్కన వ్యవసాయ బావులు చాలా ఉన్నాయి. నందిపేట మండలానికి వెళ్లడానికి చేరువుగా ఉండడంతో అనేక మంది వాహనదారులు ఇదే మార్గంలో రాకపోకలు సాగిస్తున్నారు. ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు పాఠశాలలకు వెళ్లే బస్సులు, ఆటోలు, ప్రైవేటు వాహనాలతో రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. రోడ్డు విస్తరణ చేపట్టడంతో వ్యవసాయ బావులు అతి సమీపానికి వచ్చాయి. విస్తరణ చేపట్టేటపుడు ఎలాంటి భద్రతా చర్యలు చేపట్టలేదు. పనికి రాని బావులను పూడ్చివేయడం కాని ప్రయోజనంలో ఉన్న బావుల వద్ద రక్షణ చర్యలు లాంటివి చేపట్టలేదు. ఒకవేళ వాహనాలు అదుపు తప్పితే బావుల్లోకి దూసుకెళ్లే ప్రమాదం ఉంది. అలాగే ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామం నుంచి జక్రాన్‌పల్లి మండలం అర్గుల్ వెళ్లే మార్గంలో సైతం రోడ్డు పక్కన వ్యవసాయ బావులు ప్రమాదకరంగా మారాయి.

శాశ్వత పరిష్కారాలు శూన్యం

రోడ్డు పక్కన గల వ్యవసాయ బావుల వల్ల ప్రమాదాలు జరగకుండా అధికారులు తీసుకుంటున్న చర్యలు శూన్యం. గతంలో ఎన్ఆర్‌జీఎస్ పథకం ద్వారా నిధులు మంజూరు చేయగా కొంతమంది రైతులు బావుల చుట్టూ రక్షణగా ప్రహరీలు నిర్మించుకున్నారు. కాగా ప్రస్తుతం ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడంతో బావుల వద్ద రక్షణ లేకుండా పోయింది. ప్రమాదాలు జరిగినపుడు మాత్రమే హడావుడి చేసే అధికారులు శాశ్వత పరిష్కారాలు మాత్రం చేపట్టడం లేదు.

ఇప్పటి వరకు జరిగిన ప్రమాదాలు

- 2010లో ఆర్మూర్ మండలం అంకాపూర్, జక్రాన్‌పల్లి మండలం మునిపల్లి గ్రామాల మధ్యలో రోడ్డు పక్కన గల వ్యవసాయ బావిలోకి ట్రాక్టర్ దూసుకెళ్లిన ఘటనలో తొమ్మిది మంది కూలీలు మృతి చెందగా.. పలువురికి గాయాలయ్యాయి.
- అలాగే 2018లో మెండోరా మండల కేంద్రం శివారులో రోడ్డు ప్రక్కనే ఉన్న వ్యవసాయ బావిలోకి ఆటో దూసుకెళ్లిన ఘటనలో 11 మంది దుర్మరణం పాలయ్యారు.
- ఆర్మూర్ మండలం మచ్చర్ల శివారులో ఎనిమిదేళ్ల క్రితం కారు బావిలోకి దూసుకెళ్లిన ఘటనలో ఒకరు మృతి చెందారు. అలాగే అదే గ్రామ శివారులో మూడేళ్ల క్రితం మోటారు బైకు దూసుకెళ్లిన ఘటనలో ఒకరు మృతి చెందారు.

ప్రతిపాదనలు పంపాం

ఆర్అండ్‌బీ రోడ్ల పక్కన ప్రమాదకరంగా ఉన్న వ్యవసాయ బావులను గుర్తించాం. రక్షణగా ప్రహరీలు నిర్మించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరు కాగానే పనులు చేపడతాం.

– నాందేవ్, డీఈ, ఆర్అండ్‌బీ శాఖ, ఆర్మూర్

మోదీకి స్వాగతం పలికిన మేడపాటి



స్వాగతం పలుకుతున్న మేడపాటి ప్రకాష్ రెడ్డి



బాల్కొండ నుంచి వెళ్తున్న బీజేపీ నాయకులు

బోధన్: నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని జగిత్యాల జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన బీజేపీ విజయ సంకల్ప యాత్ర సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని హెలిప్యాడ్ వద్ద బోధన్‌కు చెందిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేడపాటి ప్రకాష్ రెడ్డి, పలువురు నాయకులు ఘన స్వాగతం పలికారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ ఏర్పాటు చేసిన విజయ సంకల్ప యాత్ర సభకు నియోజకవర్గం పరిధిలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు వాహనాల్లో తరలి వెళ్లారు.

మోదీ సభకు తరలిన బీజేపీ నాయకులు

బాల్కొండ: జగిత్యాల్ జిల్లా కేంద్రంలో సోమవారం బీజేపీ తలపెట్టిన విజయ సంకల్ప సభకు బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండలాల నుంచి బీజేపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. వెళ్లిన వారిలో పార్టీ మండలాల అధ్యక్షులు అంబటి నవీన్, గడ్డం సంతోష్‌రెడ్డి ఉన్నారు.

జోరందుకున్న భూసర్వే

సాక్షి ఎఫెక్ట్..



బాల్కొండలో సర్వే చేస్తున్న అధికారులు

బాల్కొండ: మండల కేంద్రంలోని 1333 సర్వే నంబరులో చేపడుతున్న సర్వే ఒక్క సారిగా సోమవారం మళ్లీ జోరందుకుంది. ప్రభుత్వ భూమి పై సర్వే జరుగుతున్న తీరు, భూముల కబ్జాపై ఆదివారం సాక్షి దినపత్రికలో 'కబ్జా కోరల్లో ప్రభుత్వ భూములు' అనే శీర్షికన వార్తా కథనం ప్రచురించడంతో సర్వే మళ్లీ ఊపందుకుంది. డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ల్యాండ్ సర్వేయర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సర్వే చేపట్టారు. కొన్ని చోట్ల ఇళ్లు కూడ ప్రభుత్వ భూముల్లో రావడంతో హద్దులు ఏర్పాటు చేశారు. గతంలో ఏర్పాటు చేసిన హద్దులను తొలగిస్తూ, మళ్లీ వేరే హద్దులు ఏర్పాటు చేయడంతో స్థానికులు ఆందోళన చేశారు. సర్వే సక్రమంగా చేపట్టకపోతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హెచ్చరించారు.

పది పరీక్షలు ప్రారంభం



బోధన్ పట్టణ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హాల్ టికెట్లను తనిఖీ చేస్తున్న అధికారులు



బాల్కొండ ప్రభుత్వ పాఠశాలలో ..

సాక్షి నెట్‌వర్క్ : పదవ తరగతి వార్షిక పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు అర గంట ముందే చేరుకుని వారి హాల్ టికెట్ నంబర్ ఏ గదిలో ఉందో చూసుకున్నారు. సంబంధిత అధికారులు, విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి లోనికి అనుమతించారు. బోధన్ పరిధిలో ఆరుగురు విద్యార్థులు, ఆర్మూర్ పరిధిలో ఇద్దరు, ఉమ్మడి వర్ని మండల పరిధిలో ఒకరు, రుద్రూర్‌లో ఒకరు, కోటగిరిలో ఇద్దరు, ఉమ్మడి బాల్కొండ పరిధిలో ఒకరు, కమ్మర్‌పల్లిలో ఇద్దరు పరీక్షకు గైర్హాజరైనట్లు విద్యాధికారులు తెలిపారు. అలాగే పరీక్షా కేంద్రాల్లో ఎలాంటి మాస్‌కాపీయింగ్ జరగకుండా ఇన్విజిలేటర్లు పర్యవేక్షించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను అమలు చేశారు.



మాణిక్‌భండార్ పరీక్షా కేంద్రం వద్ద...



ఆర్మూర్‌లో హాల్‌టికెట్ నెంబర్ చూసుకుంటున్న విద్యార్థులు



వర్ని పరీక్షా కేంద్రంలో..

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిక



కాంగ్రెస్‌లో చేరిన వారితో ముత్యాల సునీల్‌రెడ్డి తదితరులు

మోర్తాడ్: మోర్తాడ్ బద్దంవాడ సంఘం సభ్యులు 40 మంది బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో సోమవారం చేరారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు ముత్యాల రాములు, వైశ్రీ, లడ్డు గంగాధర్, బూత్‌పురం మహిపాల్, అశోక్, చిన్న గంగారాం, తదితరులు పాల్గొన్నారు.

ముప్కాల్ మాజీ సర్పంచ్..



బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రం తాజా మాజీ సర్పంచ్ కొమ్ముల శ్రీనివాస్ తన అనుచరులతో కలిసి సోమవారం మండల కేంద్రంలో ముత్యాల సునీల్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయనతో పాటు గ్రామానికి చెందిన మాల, మాదిగ, యాదవ సంఘ సభ్యులు సుమారు 500 మంది కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి చేపడుతున్న ప్రజా సంక్షేమ పాలనకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నామని ఆయన అన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు ముత్యంరెడ్డి, మాజీ ఎంపీపీ జక్క రాజేశ్వర్, డీసీసీ డెలిగెట్ జైడి రవి పాల్గొన్నారు.

పొద్దుటూరి వినయ్ రెడ్డి సమక్షంలో..



నందిపేట్(ఆర్మూర్): వెల్మల్ గ్రామ సర్పంచ్ మచ్చర్ల సాయమ్మతో పాటు బీఆర్ఎస్ నాయకులు పెద్ద గంగారాం, గంగాధర్, శ్రీకాంత్, చిన్న గంగన్న బీఆర్ఎస్ పార్టీని వీడి ఆర్మూర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో నిజాం గర్ కెనాల్ మాజీ చైర్మన్ యల్లా సాయిరెడ్డి, నందిపేట్ మండల అధ్యక్షుడు మంద మహిపాల్, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఇంద్రుడు, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

■ కొనసాగుతున్న ఉత్సవాలు..


బాల్కొండ: వన్నెల్(బి) గ్రామంలో శ్రీలక్ష్మి వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవాలు కొనసాగుతున్నాయి. సోమవారం ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం శ్రీదేవి, భూదేవి సమేతంగా వేంకటేశ్వరుని కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం అన్నదానం ఉంటుందన్నారు.



■ మహాదేవ స్వామి జాతర

కమ్మర్‌పల్లి: హాసాకొత్తూర్‌లో అన్నపూర్ణ సమేత మహాదేవ స్వామి జాతరోత్సవాలు సోమవారం గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో సుప్రభాత సేవ, మహాగణపతి పూజ, తదితర కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు కొమ్ముల రజనీకాంత్, కార్యదర్శి కుందారం శ్రావణ్, ఉపాధ్యక్షుడు రాజుల బావులు తదితరులు పాల్గొన్నారు.

■ ఆధ్యాత్మిక కేంద్రంగా విఠలేశ్వర ఆలయం



రుద్రూర్: మండల కేంద్రంలోని విఠలేశ్వర స్వామి ఆలయం ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతోంది. శిథిలావస్థకు చేరిన పురాతన ఆలయాన్ని దాతల విరాళాలతో, దేవాదాయ శాఖ నిధులతో సర్వాంగ సుందరంగా నిర్మించి ఏడాది క్రితం పునః ప్రారంభం చేశారు. ఆలయ ప్రథమ వార్షికోత్సవం దశమి(మంగళవారం) నుంచి ద్వాదశి(గురువారం) వరకు నిర్వహించడానికి ఆలయ కమిటీ ఏర్పాట్లు చేస్తోంది. ఈ నెల 19 నుంచి 21 వరకు కుంకుమార్చన, గణపతి పూజ, అఖండ దీపారాధన, గోపూజ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారని, పరమ హంస మధుసూదనానంద సరస్వతి స్వామి ప్రవచనం ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలియజేశారు.

'బాధ్యత గల పౌరులుగా తయారవుతారు'



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ వేణుగోపాల స్వామి

పెర్కిట్(ఆర్మూర్): ఎన్ఎస్ఎస్‌తో విద్యార్థులు కళాశాల స్థాయి నుంచే సమాజంపై బాధ్యత గల పౌరులుగా తయారవుతారని ఆర్మూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ తిరుక్కోవెల వేణుగోపాల స్వామి అన్నారు. పిప్రి, ఫత్తేపూర్, గోవింద్‌పేట్ గ్రామాల్లో సోమవారం డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు ప్రారంభించారు. ఫత్తేపూర్‌లో నిర్వహించిన ప్రారంభోత్సవంలో ప్రిన్సిపల్ మాట్లాడుతూ.. జాతీయ సేవా పథకం అనేది చాలా అత్యుత్తమైన కార్యక్రమమన్నారు. అకాడమిక్ కో–ఆర్డినేటర్ రాజేష్ కుమార్ మాట్లాడుతూ.. మానవ సేవే మాధవ సేవ అనే సూక్తితో పౌరులు సమాజంలో మెదలాలని సూచించారు. ప్రోగ్రాం యూనిట్ ఆఫీసర్లు వెంకటేశ్వర్లు, యాదగిరి, అనిత పవార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి



రుద్రూర్: వేసవిలో ఉపాధి హామీ కూలీల సంఖ్య పెంచాలని మండల అభివృద్ధి అధికారి సురేష్ బాబు సూచించారు. రుద్రూర్ గ్రామ పెద్ద చెరువులో కొనసాగుతున్న పూడికతీత పనులను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కూలీలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఎండలు తీవ్రమవుతున్నందున వేసవి కాలంలో ఉదయం 7 నుంచి 11 గంటల వరకు పని చేయాలని సూచించారు. పూడిక మట్టిని పంట పొలాల్లోకి తరలించాలన్నారు.

బెల్ట్ షాప్‌పై దాడి

వర్ని: మండలంలోని పులి క్యాంప్‌లో ఉన్న బెల్ట్‌షాప్‌పై పోలీసులు సోమవారం దాడి నిర్వహించారు. కిరాణషాపులో అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై కృష్ణ కుమార్ తెలిపారు. ఈ దాడిలో రూ. 30 వేలు విలువ చేసే మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

రైతులకు పంట నష్ట పరిహారం అందించాలి



ఇందల్వాయి: అకాల వర్షాలకు పంటలు దెబ్బతినడంతో రైతులకు రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కులాచారి దినేష్ పేర్కొన్నారు. మండలంలోని ఎల్లారెడ్డిపల్లె, నల్లవెల్లి గ్రామాల్లో వడగల్ల వానకి దెబ్బతిన్న పంటలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా దినేష్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఫసల్ బీమా యోజన పథకాన్ని పక్కాగా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. వరి పైరు పూర్తిగా దెబ్బతిన్నదని, వ్యవసాయ అధికారులు పంట నష్టం అంచనా వేసి, ప్రభుత్వానికి నివేదిక అందించాలన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు నాయిడి రాజన్న, ఉపాధ్యక్షుడు కన్నెచిన్ను, నాయకులు సక్కి సత్యనారాయణ, మనోహర్, రైతులు ఉన్నారు.

'అభివృద్ధి చూసి ఓర్వలేకే ధ్వంసం చేస్తున్నారు'



మాట్లాడుతున్న బీజేవైఎం నాయకులు

పెర్కిట్: ఆర్మూర్ పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి తన సొంత ఖర్చులతో ఏర్పాటు చేసిన ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసినట్లు బీజేవైఎం నాయకులు అన్నారు. మామిడిపల్లిలో బీజేవైఎం ఆధ్వర్యంలో నేతలు సమావేశం నిర్వహించి మాట్లాడారు. పాఠశాల తలుపులు, ఇతర సామాన్లు, అలాగే మినీ స్టేడియం ప్రహరీని ఆదివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. రాకేష్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధిని చూడలేక కొంతమంది అల్లరి మూకలతో ఇలాంటి దాడులు చేయడం సరికాదన్నారు. ధ్వంసం చేసిన వారిపై పోలీసులు తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేవైఎం ఆర్మూర్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు కలిగోట ప్రశాంత్, ఉదయ్‌గౌడ్, ఉపాధ్యక్షుడు భరత్ పాల్గొన్నారు.

పాఠశాల తలుపులు ధ్వంసం





ధ్వంసమైన ఫ్యాన్, తలుపు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో గుర్తు తెలియని వ్యక్తులు లోనికి చొరబడి పాఠశాలకు సంబంధించిన తలుపులు ధ్వంసం చేశారు. అలాగే పాఠశాలలోని ఆరు గదులలో 6 ఫ్యాన్లు, పాఠశాలకు సంబంధించిన సామగ్రిని ధ్వంసం చేశారు. ఈ విషయమై పాఠశాల ఉపాధ్యాయులు, పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లీష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	బులెట్ (తెలుగు) – 10.25 సైతాన్ (హిందీ) – 1.15, 7.00 బాబు (తెలుగు) – 4.15 ఆపరేషన్ వాలెంటైన్ (తెలుగు) – 10.00
స్క్రీన్-2 –	గామి (తెలుగు) – 12.00, 3.10, 6.20, 9.30
స్క్రీన్-3 –	భీమా (తెలుగు) – 12.30, 3.35, 6.40, 9.45

నాటడం.. నరకడం.. తగలబెట్టడం



నాగంపేట్‌లో నిప్పు పెట్టడంతో కాలిపోయిన చెట్లు

బాల్కొండ: హరితహారంలో నాటిన మొక్కలు చెట్లయ్యాయి.. చల్లని నీడను ఇస్తాయనుకునే సమయంలో విద్యుత్ తీగలకు అడ్డువస్తాయనే కారణంతో ట్రాన్స్‌కో అధికారులు నరికేస్తున్నారు. దానికి తోడు పంట దిగుబడులు తారు రోడ్డుపై ఆరబెట్టిన రైతులు వాటి ద్వారా వచ్చిన వ్యర్థాల కుప్పలను అలానే తగుల బెడుతున్నారు. దీంతో రోడ్డు పక్కన ఉన్న చెట్లు కూడా తగుల బడి పోతున్నాయి. బాల్కొండ మండలం నాగంపేటలో ఓ రైతు, దిగుబడుల వ్యర్థాలకు నిప్పు పెట్టడంతో ఇలా హరితహారం చెట్లు కూడా కాలిపోయాయి. అయినా అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.